నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 నిజామాబాద్ మంగళవారం 26 నవంబర్ 2024 ADILABAD NIRMAL


### శైలజపైనే మాకు ఆశలు ఉండేవి



మా మేన కోడలు శైలజ చదువులో చురుకుగా ఉండేది. శైలజ తండ్రి తుకారం తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. శైలజ ఉన్నత చదువులు చదువుకొని తప్పకుండా మంచి స్థాయికి వెళ్తుందని ఎంతో ఆశపడ్డారు. కానీ చివరికి ఇలా అయ్యింది. ఆమె చనిపోతుందని అస్సలు అనుకోలేదు.

**- నాందేవ్, శైలజ మేనమామ**

### ప్రాణాలతో తిరిగి వస్తుందనుకున్నం



మా తమ్ముడి కూతురు శైలజ ప్రాణాలతోనే తిరిగి వస్తుందనుకొని ఎంతో ఆశ పడ్డం. హైదరాబాద్‌లోని పెద్ద దవాఖానలో చేర్పించిన్రు అన్నరు. ఏం కాదనుకున్నం. కానీ చివరికి మా బిడ్డ శవాన్ని అప్పగిస్తరనుకోలేదు. మా బిడ్డ చావుకు అధికారులే బాధ్యత వహించాలి. మా ఇంటికి పెద్దదైన శైలజపై మేము ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. చివరికి మరణవార్త వినాల్సి వచ్చింది.

**- వడాయి కన్ను, శైలజ పెద్దనాన్న**



*ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే మడావి గంగోత్రి(14) వాంతులు, విరేచనాలు చేసుకుని మృతి చెందింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చూపించి వైద్యుల సూచనల మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. కాగా.. గంగోత్రి పాఠశాల బాత్‌రూమ్‌లోనే స్పృహతప్పి పడిపోయి చనిపోయిందని.. పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోతే ఆమె మృతి చెందేది కాదంటూ వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు.*

***- ఈ ఘటన అక్టోబర్ 26, 2024న జరిగింది.***



రాలిన విద్యాకుసుమం

హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందిన శైలజ, (ఇన్‌సెట్లో) శైలజ (ఫైల్)

# ఆశ్రమాల్లో మృత్యుఘోష

## ఫుడ్ పాయిజన్‌తో వాంకిడి విద్యార్థిని మృతి

- నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- 20 రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిన శైలజ
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు
- అధికారుల నిర్లక్ష్యమేనంటూ మండిపాటు
- ప్రాణాలతో తిరిగొస్తుందనుకున్నాం : బంధువులు

*బంగారు భవిష్యత్ కోసం ఎన్నో కలలు కన్న విద్యాకుసుమం అర్ధాంతరంగా తనువు చాలించింది. ఫుడ్ పాయిజన్‌తో దవాఖాన పాలైన ఆ బాలిక మృత్యువుతో పోరాడుతూ చివరకు ఓడిపోయింది. ఉన్నత చదువులు చదివి తమకు అండగా నిలుస్తుందనుకొని ఆశపడ్డ ఆమె తల్లిదండ్రులకు చివరకు దు:ఖమే మిగిలింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఊపిరి వదలగా, స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. అధికారుల నిర్లక్ష్యమే నిండుప్రాణాన్ని బలిగొన్నదంటూ ఆయా వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.*



దాబా గ్రామంలోని శైలజ ఇంటి ఎదుట బంధువులు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/వాంకిడి, నవంబర్ 25 : వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో గత నెల 30న ఫుడ్ పాయిజన్ కాగా, 64 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కొంత మందిని వాంకిడి పీహెచ్‌సీ, ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, మరి కొంత మందిని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలోని ప్రైవేట్ దవాఖానల్లో చేర్పించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారగా, హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. నవంబర్ 5న తొమ్మిదో తరగతి చదువుతున్న శైలజతో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థిని మహాలక్ష్మిని, ఏడో తరగతి విద్యార్థిని జ్యోతిని నిమ్స్‌లో చేర్పించారు. వీరిలో మహాలక్ష్మి, జ్యోతి కోలుకోవడంతో ఈ నెల 14న డిశ్చార్జి చేశారు. కానీ.. శైలజ ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. మొదట శైలజ కోలుకుందని చెప్పిన వైద్యులు ఆమెను జనరల్ వార్డుకు తరలించారు. మరుసటి రోజు మళ్లీ విషమించడంతో తిరిగి వెంటలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. వైద్యానికి ఆమె ఆరోగ్యం సహకరించ లేదు. మూడు రోజులుగా కృత్రిమ శ్వాసపై ఉంచి వైద్యం అందించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి దవాఖానకు వెళ్లి శైలజను పరామర్శించారు. మంత్రులు సీతక్క, దామోదర్ రాజనర్సింహ సైతం పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. 20 రోజులుగా మృత్యువుతో పోరాడిన శైలజ సోమవారం తుది శ్వాస విడిచింది.

### 20 రోజులుగా దవాఖానలోనే..

కూతురు శైలజ దుస్థితిని చూసి ఆమె తల్లిదండ్రులు చౌదరి తుకారం, మీరాబాయి ఆందోళన చెందుతూ వచ్చారు. 20 రోజులుగా కంటిమీద కునుకులేకుండా కూతురుతో పాటు దవాఖానలోనే ఉన్నారు. వాంకిడి మండలం దాబా గ్రామానికి చెందిన తుకారం దంపతులది వ్యవసాయ కుటుంబం. తమకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. శైలజ వాంకిడిలోని ఆశ్రమ పాఠశాలలో 9 వ తరగతి, కుమారుడు వాంకిడి జడ్పీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కూతురు శైలజ చదువులో చురుకుగా ఉండేదని, ఉన్నత చదువులు చదివి తమకు అండగా నిలుస్తుందని తల్లిదండ్రులు ఎంతో ఆశపడ్డారు. ప్రాణాలతో తిరిగి వస్తుందనుకున్న బిడ్డ చివరికి మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యమే..

ఆశ్రమ విద్యార్థిని శైలజ ఆరోగ్యంపై అధికారులు ముందు నుంచి సరైన శ్రద్ధతీసుకొని ఉంటే ఇలా జరిగేది కాదని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, విద్యార్థినులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం వల్లే బాలిక చనిపోయిందని వారు మండిపడుతున్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, 11 నెలల కాంగ్రెస్ పాలనలో ఆశ్రమాల్లో మృత్యుఘోష వినిపిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తుండగా, కలకలం రేపుతున్నది.

# 'దీక్షా దివస్'ను సక్సెస్ చేయాలి

- కాంగ్రెస్ పాలనపై ప్రజల ఆగ్రహం
- స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌దే విజయం
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి
- దీక్షా దివస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్



దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు



దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న, వేదికపై మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఈ నెల 29న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని దీక్షా దివస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ కోరారు. సోమవారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం కోసం పదవులను త్యాగం చేశారన్నారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా 14 ఏండ్లు ఉద్యమం చేసి దీక్ష చేపట్టారని, దీంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిందని గుర్తు చేశారు. గ్రామాల్లో ఉద్యమ కాలం నాటి ఫొటో ప్రదర్శనలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో 11 నెలల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఆరు గ్యారెంటీల పేరిట ఓట్లు దండుకున్న ప్రభుత్వం వాటిని అమలు పర్చక ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. రైతుభరోసా, రుణమాఫీ, తులం బంగారం, రూ.2500 వంటి పథకాలను పక్కన పెట్టిందని తెలిపారు. పంటల కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా, మూసి పేరిట డబ్బులు వసూలు చేసి ఢిల్లీ పెద్దలకు పంపిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని మండిపడ్డారు. దీక్షా దివస్‌తో మరోసారి బీఆర్ఎస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకుంటుందని తెలిపారు.

### బీఆర్ఎస్ శ్రేణులకు పదవులు గ్యారెంటీ..

**- అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల పాలనతో ప్రజలు విసిగిపోయారని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. స్థానిక సంస్థలతోపాటు ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని.. గులా బీ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులు గ్యారెంటీ అని అన్నారు. దీక్షా దివస్‌కు నాయకులు బాధ్యత తీసుకుని విజయవంతం చేయాల న్నారు. గ్రామాల్లో దీక్షా దివస్ ప్రాధాన్యత తెలిపేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎన్ అభ్యర్థుల ను గెలిపించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. 29న జరిగే దీక్షా దివస్‌లో గులాబీ సైనికులు ఎక్కువ సంఖ్యలో హాజరుకావాలని, భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించాలని కోరారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### గూడ్‌గోన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**- మాజీ మంత్రి జోగు రామన్న**

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పత్తి వ్యాపారులతో కుమ్మక్కై తేమతో సంబంధం లేకుండా ఒకే ధరకు క్వింటాలుకు రూ.6,800 చొప్పున గూడ్‌గోన విధానంలో పత్తిని కొనుగోలు చేయించారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. అన్ని విషయాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ గూడ్‌గోనగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, వారి సమస్యలను పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేకు దమ్ముంటే ఫసల్ బీమా అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేయాలని సూచించారు. దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరివచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రిపై కేసు పెట్టాలని తాము పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఎంపై ఆదిలాబాద్‌లో ప్రైవేటు కేసు పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ పాల్గొన్నారు.

# గజ గజ

- గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఆసిఫాబాద్ జిల్లాలో 8.3 డిగ్రీలు



అర్లి(టీ)లో చలిమంట కాగుతున్న గ్రామస్తులు

ఆదిలాబాద్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలితీవ్రత పెరిగింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యూ) మండలంలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రత 8.3 డిగ్రీలు నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో 9.9 డిగ్రీలు, నిర్మల్‌లో 10.9 డిగ్రీలు, మంచిర్యాలలో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో చలితీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన చలి ఉదయం 9 గంటల వరకు ఉంటుంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ప్రభావం అధికంగా ఉంటున్నది.

# ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు దుర్మరణం
- మృతుల్లో చిన్నారి, వృద్ధుడు
- ఒకరికి తీవ్రగాయాలు



షేక్ అలీ(ఫైల్)



షేక్ ఇషాన్(ఫైల్)



గాయపడ్డ షేక్ అర్హాన్

జైనథ్, నవంబర్ 25 : మండల కేంద్ర సమీపంలోని బర్కం హనుమాన్ ఆలయం ఎదుట గల అంతర్రాష్ట్ర రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. జైనథ్ జాతర నుంచి టీఎస్ 01 ఈఎల్ 3858 అనే మోటార్ సైకిల్‌పై షేక్ అలీ (58), షేక్ ఇషాన్(4), షేక్ అర్హాన్(6) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్‌కు వస్తున్నారు. ఆర్టీసీ బస్సు నంబర్ టీఎస్ 01 యూసీ 6615 ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు వెళ్తున్నది. జైనథ్ సమీపంలోని బర్కం హనుమాన్ ఆలయం ఎదుట ఆర్టీసీ బస్సు అదుపు తప్పి మోటార్ సైకిల్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న వృద్ధుడు షేక్ అలీ(58), చిన్నారి షేక్ ఇషాన్(4) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. షేక్ రిహన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 ద్వారా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైనథ్ ఎస్సై వి.పురుషోత్తం, ఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌లోని మార్చురికి తరలించారు. ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.